







బా..పూజనీయుడు..

గాంధీ తాత.. ఆ తరం నుంచి నేటి తరం వరకూ అందరికీ తాత..మన జాతిపిత.. మన జీవితంలో ఒక భాగం గాంధీ అంటే.. నాటికి.. నేటికీ బా..పూజనీయులే.. ఎందుకంటే తరాలు మారినా ఆశయాలతో చెరగని ముద్ర వేశారు.. నేటికీ ముందుండి నడిపిస్తున్నారు.. గాంధీ జయంతిని బుధవారం ఊరూవాడా పండుగలా చేశారు. ఈ చిత్రంలోనే చూడండి కడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎండను సైతం లెక్కచేయకుండా గాంధీకి నివాళిగా ఇలా చేశారు.. నిను మరువం బాపూ అంటూ చెప్పకనే చెప్పారు.. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నీ బాటలో నడుస్తాం అంటూ నివాళులర్పించారు. చిత్రంలో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును చూడవచ్చు.. - వివరాలు 8లో

దేవీ వైభవం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 2 : రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి 91వ శరన్నవ రాత్రి మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రా రంభ మయ్యాయి. ఆలయ అర్చకులు దేవినవరాత్రి ఉత్సవ కమిటీ పెద్దల సమక్షంలో రాత్రి 9.09 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. మైసూర్ తర్వాత దసరా ఉత్సవాలు రాజమహేంద్రవరంలో ఘనంగా జరుగుతాయి. విజయవాడ కనకదుర్గమ్మతల్లి ఆలయం శిఖరం ఆకారంలో భారీ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలంకరణ సెట్టింగ్‌లు ఆకర్షణగా నిలిచాయి.తొలిరోజే పెద్ద ఎత్తున భక్తజనం హాజరై అమ్మవారిని కొలిచారు.9 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



దేవీచౌక్‌లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన.. ఆలయం వద్ద విద్యుద్దీపకాంతులు

దేవీచౌక్‌లో ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): దేవీ చౌక్‌లో గురువారం నుంచి 15వ తేదీ వరకూ ట్రాఫిక్ మళ్లిస్తున్నామని ఎస్పీ నర సింహ కిషోర్ తెలిపారు.వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండ్‌కు వెళ్లే వాహ నదారులు చిరంజీవి బస్టాండ్, స్వతంత్ర హాస్పటల్ దారిలో వెళ్లాలి.గోకవరం బస్టాండ్ నుంచి వై.జంక్షన్ వచ్చే వాహనాలు సౌతిండియా షాపింగ్ మాల్ నుంచి తుమ్మలోవ గుండా ప్రయాణించాలి.పేపర్‌మిల్ నుంచి జాంపేట వెళ్లే వాహ నాలు తుమ్మలోవ, కంబాలచెరువు, జాంపేట నుంచి పేపర్‌మిల్లు వైపు వెళ్లేవి నందం గనిరాజు జంక్షన్, కంబాల చెరువు, మెయి న్ రోడ్ నుంచి కంబాల చెరువు వెళ్లే వాహనాలు జండాపంజా రోడ్, జాంపేట దారిలో రాకపోకలు సాగించాలి.

రానున్న పుష్కరాల ట్రాఫిక్‌పై దృష్టి : ఎంపీ

రాజానగరం, అక్టోబరు 2 : రానున్న పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏవిధమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు.ఈ మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్, కమిషనర్, పోలీసులతో ఇప్పటికే సమీక్షించానన్నారు. పుష్కరాలకు దాదాపుగా ఐదు కోట్ల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. రాజమహేంద్రవరం ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.



గ్యాస్..దోపిడీ!

డెలివరీకి ఎ అదనపు చార్జ్

వంట గ్యాస్‌పై దర్జాగా దోపిడీ. అయినా అడిగేవారు లేరు. ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు. వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. వినియోగదారుడు గ్యాస్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఏజెన్సీ నిర్వాహకులు ఇంటికే సిలిండర్ సరఫరా చేయాలి. అసలే గ్యాస్ ధర సామాన్యుడి ఇంట్లో మంట పెడుతుంటే మరో పక్క అదనపు చార్జీలు భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.832 ఉంటే డెలీవరీ బాయ్ దూరాన్ని బట్టి రూ.870 నుంచి రూ.900ల వరకూ వసూలు చేస్తున్నాడు. అంటే రూ.40 నుంచి రూ.70 వరకూ తీసుకుంటున్నారు. ఒక్క రూపాయి డెలివరీ బాయ్‌కి చెల్లించనక్కర్లెద్దు. కేవలం బిల్లులో ఎంత ఉంటే అంతే చెల్లించాలి..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను బహిరంగంగా మోసం చేస్తున్నాయి. డెలివరీ పేరిట అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయి.ఈ మొత్తం ఎవరి జేబుల్లోకి వెళుతుందో తెలియదు కానీ వినియోగదారులు మాత్రం మోసపోతున్నారు. వినియోగదారుడు గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటికే సరఫరా చేయాలి. ఎంత దూరంలో ఉన్నా అదనపు చార్జీలు వసూలు చేయకూ డదు. గ్యాస్ సరఫరా చేసే డెలివరీ బాయ్స్‌కు ఏజెన్సీలే జీతాలు చెల్లించాలి.అయితే డెలివరీ పేరిట అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు.ఏజెన్సీ పక్కనే ఇల్లు ఉన్నా ఇదే తీరు. ప్రస్తుతం డొమెస్టిక్ వంట గ్యాస్ 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.832గా ఉంది. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.1785గా ఉంది. ఇది వాణిజ్య గ్యాస్ ధర.ఇక 5 కేజీల సిలెండర్ ధర రూ.541గా ఉంది. కానీ గ్యాస్ సరఫరా చేసినందుకు డెలివరీ బాయ్స్ అదనంగా రూ.30 నుంచి రూ.80 వరకూ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పైసా కూడా అదనంగా వసూలు చేయకూడదు.

జిల్లాలో 6,24.265 కనెక్షన్లు

జిల్లాలో హెచ్‌పీసీఎల్ కంపెనీకి 21 ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 4,60,465 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఐవోసీఎల్ కంపెనీకి 12 ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,26,793 కనెక్షన్లు ఉన్నాయి. బీపీసీఎల్ కంపెనీకి 3 ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధి లో 37,007 కనెక్షన్లు ఉన్నాయి.ఇలా జిల్లాలో మొత్తం 6,24,265 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.వీరంతా డెలివరీ బాయ్స్‌కు సగటున రూ.30 ఇచ్చినా జిల్లాలో నెలకు రూ .1,87,27,950 ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నట్టే. ఇది ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉంది.దీనిపై ప్రజల్లో తీవ్ర ఆందోళన ఉంది.కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో ఆ అక్రమ వసూళ్లను అరి కట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో కూడా ఏజెన్సీలు లేవు. వాటిని విస్త రించి,అక్రమాలు అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

- గ్యాస్ ధర రూ.832 మాత్రమే
- దూరాన్ని బట్టి అదనపు వసూళ్లు
- డెలివరీ పేరిట రూ.40 నుంచి రూ.70
- రూపాయి కూడా చెల్లించనక్కర్లెద్దు
- జిల్లాలో 6.24 లక్షల కనెక్షన్లు
- రూ.30 లెక్కవేసినా రూ.1.87 కోట్లు
- పట్టించుకోని అధికారులు
- అవగాహన లేని వినియోగదారులు

గ్యాస్ డెలివరీకి అదనపు చార్జీల్లేవ్..

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు సిలిండర్ సరఫరా చేసినందుకు చార్జీల కింద ఒక పైసా కూడా ఇవ్వనవసరం లేదు. కేవలం గ్యాస్ బిల్లులో ఉన్న డబ్బు ఇస్తే చాలు. అంటే ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.832లు. ఆ మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. డెలివరీ బాయ్స్ చార్జీలన్నీ ఏజెన్సీలు భరిస్తాయి.

- ఎం.నాగాంజనేయులు, ఇన్‌చార్జి డీఎస్‌వో.

సిలిండర్‌కు రూ.50 అదనంగా వసూలు



గ్యాస్ సిలిండర్ ధర రూ.832 ఉంది. దానిపై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధర ఆకాశంలో ఉంది. అదనంగా డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో సిలిండర్‌కు రూ.50 నుంచి రూ.70 వసూలు చేస్తున్నారు. అలా ఇవ్వాలేమో అనుకుంటున్నా.. ఇవ్వకూడదని నాకు తెలియదు. అధికారులు స్పందించి అదనపు చార్జీలు వసూలు చేయకుండా చూడాలి.

- చిట్టాబత్తుల కృష్ణవేణి, రాజమహేంద్రవరం.

అదనపు వసూళ్లు దారుణం..



గ్యాస్ ధర భారీగా పెంచేయడంతో ఇబ్బందిపడుతున్నాం. సిలిండర్ ధర ప్రస్తుతం రూ.832గా ఉంది. అయితే డెలివరీ చార్జీలతో కలిపి రూ.870 నుంచి రూ.890 వరకు తీసుకుంటున్నారు. డెలివరీ చార్జీలు లేవని నాకు తెలియదు. ప్రతి నెలా ఇంతే. ధర పెంచినా డెలివరీ చార్జీ తీయలేదేంటా అనుకునే దానిని.. డెలివరీ చార్జీలు లేకుండా వసూలు చేయడం దారుణం. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- అల్లక అరుణకుమారి, వీరవరం.



స్వచ్ఛ భారత్‌కు పునరంకితమవుదాం

స్వచ్ఛతా హీ సేవ ముగింపులో ఎంపీ పురందేశ్వరి



కోటిపల్లి బస్టాండ్‌లో శుభ్రంచేసి చెత్త ఎత్తుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 2 : స్వచ్ఛభారత్ నిర్మాణంలో మనందరం పునరంకితం అవుదామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్ సాకారం చేసుకోవడానికి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల ద్వారా వారిలో అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు.రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో బుధవారం స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలసి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రధాని మోదీ పదేళ్ల కిందట స్వచ్ఛభారత్‌కు పిలుపు ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో వినూత్న, ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళ అశోక, తహశీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పాటుపడదాం : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 2 : గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునిచ్చారు. రూరల్ మండలం బొమ్మూరులో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ ముగింపు వేడుక నిర్వహించారు. ముందుగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల్లో పరిశుభ్రత అత్యంత కీలకమైన అంశం అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి విజన్-2047 ప్రతి పాదనలు ఆమోదించామని డీపీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు భాగ స్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహణలో 9 అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీనివాసరెడ్డి(బొమ్మూరు కార్యదర్శి), ఎంఈపీ నెహ్రూ (నెలటూరు), కె.రమేష్(కోరుకొండ), ఎస్‌కే.ఇమాంమున్నీషా బేగం (ముక్కినాడ), ఎస్.సాయికిషోర్(అనపర్తి), బి.రత్నం(దూబచర్ల), ఆర్.సుజాత(వంగలపూడి), పి.హరీష్ బాబు(జగన్నాథపురం),డి.ముత్యం(బపంగిడి) పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులను సత్కరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు,డీఎల్‌పీవో నాగలత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల



ఇసుక తీతకు.. సహకారమేది!

ఇంకనూ పూర్తికాని బోట్స్‌మన్ సొసైటీల ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ,అక్టోబరు 2: జిల్లాలో గోదావరి ఇసుక తీత పనులు చేసుకుంటూ జీవనం సాగించిన బోట్స్‌మెన్స్ సొసైటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో కొన్ని సొసైటీలకు ఉద్వాసన పలుకగా అవి మనగడ కోల్పోయి రోడ్డున పడ్డాయి. గత పాలకులకు అనుకూలంగా ఉన్న సొసైటీలకు అనుమతులిచ్చారు. వాటిలో అనుకూలంగా లేని వాటిని మధ్యలోనే వివిధ సమస్యలు సృష్టించి నిలుపుదల చేయించారు. ఈ సొసైటీలు అన్ని గోదావరి ఇసుకతీత పనులపై ఆధారపడి జీవనం సాగించేవే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయిన సొసైటీలతో పాటు పెండింగ్‌లో పెట్టిన సొసైటీలను ఎంపిక చేసి మళ్లీ ఇసుకతీత పనులు కల్పించి జీవనోపాధి కల్పిస్తారని కొండంత ఆశ తో ఎదురుచూశారు. అయితే దానికి భిన్నంగా జరగడంతో సొసైటీలకు నిరాశ ఎదురవుతుంది. వీటిలో బినామీ పేర్లతో ఉన్న వాటిని నిలుపుదల చేస్తే పెద్దగా సమస్య ఉండకపోవచ్చు కానీ ఇసుకతీతపై పూర్తిగా ఆధారపడి జీవనం సాగించే సొసైటీలకు మాత్రం గడ్డుకాలమే.

ఇసుక సరఫరాకు అడ్డంకులు

జిల్లావ్యాప్తంగా ఇసుక తీత పనులు ముమ్మ రం చేయడంలో సొసైటీల పాత్ర చాలా కీలకం ఇంకా సొసైటీల ఎంపిక విధానం పూర్తికాలేదు. అందువల్ల ఇసుక ఉత్పత్తి లేక రేవులన్నీ వెలవెలబోతున్నాయి. జిల్లాలో అన్ని రీచ్‌లు ఓపెన్ కావాలంటే సొసైటీలకు వేగంగా అనుమతులు ఇవ్వా ల్సి ఉంది. ఈ ప్రక్రియ చాలా ఆలస్యం కావడంతో ఇసుక కొరత ఏర్పడి భవన నిర్మాణ రంగం కుదేలైంది. ఇప్పటికైనా కేటాయింపులు పూర్తి చేసుకుని అత్యవసరంగా ఇసుక ఉత్పత్తి చేయాల్సి ఉంది.

186 సొసైటీల ఎదురుచూపులు..

జిల్లాలో ఇసుక సొసైటీల కేటాయింపులు, ర్యాంప్‌ల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేసేందుకు కలెక్టర్, జేసీ,ఇరిగేషన్ అధికారులు కలిసి 14 మందితో ఏర్పాటు చేసిన కమిటీ ఇసుక తీత సొసైటీల ఎంపిక ప్రక్రియను పూర్తి స్థాయిలో పరిశీలిస్తుంది. జేసీ స్వయంగా వాటిని పరిశీలించి ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో ఇసుక తీత పనులకు సంబంధించి 44 సొసైటీలకు అధికార యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో 230 శాండ్ బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. వాటిలో 178 సొసైటీల పరిశీలన జరిగింది. వీటిలో 44 సొసైటీలకు అనుమతులిచ్చారు. ఇక మిగిలిన 186 సొసైటీల్లో ఎన్నింటిని ఎంపిక చేస్తారో వేచి చూడాల్సి ఉంది.ప్రతి సొసైటీకి ల్యాండ్ ఎలాట్‌మెంట్ ఇవ్వాలి.ల్యాండ్ లీజు అగ్రిమెంట్లు వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు సొసైటీలను మార్చే యడం వల్ల ఆ ప్రభావం ఇసుకపై పడుతుంది.

- జిల్లాలో 230కి 44 ఎంపిక
- 186 సొసైటీల భవిష్యత్ ప్రశ్నార్థకం
- 14 మంది సభ్యుల పరిశీలన
- నేటికీ అనుమతుల్లేక ఇక్కట్లు
- జిల్లాలో తీవ్రంగా ఇసుక కొరత
- అయినా స్పందించని అధికారులు
- లబోదిబోమంటున్న నిర్వాహకులు



మా కోసమేనని : మహిళ రక్షక్ ఆరంభ కార్యక్రమానికి ప్లకార్డులతో హాజరైన విద్యార్థినులు

మహిళలు, చిన్నారులకు కష్టం వస్తే.. డయల్ 94932 06006

- 15 నిమిషాల్లో స్పాట్‌కు వస్తాం.. రక్షిస్తాం : ఎస్పీ
- 'మహిళా రక్షక్' ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంతి



మహిళ రక్షక్ లోగో ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

రాజమహేంద్రవరం,అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): 'మహిళా రక్షక్'తో మహిళలు, చిన్నారులకు మరింత భద్రత సాధ్యమవుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్‌లో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎస్పీ నరసింహ కిశోర్ వినూత్న ఆలోచనతో రూపకల్పన చేసిన 'మహిళా రక్షక్' పోలీసుల ప్రత్యేక బ్లేజర్, లోగోలను ఆవి ష్కరించారు.మహిళా రక్షక్ ప్రత్యేక వాహనాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అందుబాటులో ఉన్న సిబ్బంది, నిధులతో మహిళలు, చిన్నారుల రక్షణకు ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా రక్షక్ ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలకు భరోసా కల్పిస్తుందన్నారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు,చిన్నారులు 94932 06006 నెంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ మెసేజ్ చేస్తే 15 నిమి షాల్లోపు పోలీసులు వారి వద్దకు చేరుకొని రక్షణ కల్పిస్తారన్నారు.డయల్ 112కి సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు. అవసరమైతే వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ నెంబర్లు 24/7 అందుబాటులో ఉంటాయని చెప్పారు.ఈ టీంలు కళాశాలలు, స్కూల్స్, వసతి గృహాలు తదితర చోట్ల నిరంతరంగా సంచరి స్తాయన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా వెళ్లి వారికి తెలియజేసిన వెంటనే చర్యలకు దిగుతారన్నారు. ఒక వేళ నేరుగా చెప్పే పరిస్థితి లేకపోతే వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అందుకు తగిన ఏర్పాట్లు చేశా మన్నారు.ఈ వాట్సాప్ నెంబరు, లోగోను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం ద్వారా మరింత మందికి అవగాహన కల్పించాలన్నారు.'మహి ళల భద్రత -మనందరి బాధ్యత' అని ప్రమాణం చేయించారు.అనంతరం మానవహారం,ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఐసీడీ ఎస్ జిల్లా అధికారిణి కె.విజయకుమారి, అడిష నల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు ఎస్.భవ్య కిషోర్, కె.రమేశ్ బా బు, జి.దేవకుమార్, సీఐలు, ఎస్ఐలు,ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు తదితరు లు పాల్గొన్నారు.



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న మహిళ రక్షక్ టీమ్..



ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో నేటి నుంచి
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ద్రాక్షారామ, అక్టోబరు 2: అష్టాదశ శక్తి పీఠాల్లో ద్వాదశ శక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 3వ నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో వేదపారాయణ ప్రయుక్త, దేవీ భాగవతం, చండీ సప్తశతి, సుందరకాండ, మన్యు సూక్తం, లలితా పారాయణ, సూర్యనమస్కారాలు, నవగ్రహ జపాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3.30 వరకు శ్రీచక్ర నవావర్ణార్చన, 3.30 గంటలకు కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు అమ్మవారికి సువర్ణ, రజత పుష్పార్చన జరుపుతారు. మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 9న సరస్వతి పూజ, విజయదశమిని పురస్కరించుకుని 12న శమీపూజ వేగాయమ్మపేటలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తొండంగి, అక్టోబరు 2: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు పెట్రోలు బంకు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకత్తా నుంచి చెన్నై ఐరన్ షీట్ల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ ఎటువంటి హెచ్చరిక సిగ్నల్ వేయకుండా ఆకస్మికంగా ఆపివేశాడు. వెనుకనే విశాఖ నుంచి పాలకొల్లు రొయ్యల లోడు నిమిత్తం వెళ్తున్న లారీ ముందున్న లారీని బలంగా ఢీకొట్టడంతో లారీ కేబిన్ నుజ్జునుజ్జయ్యింది. అందులో చిక్కుకున్న డ్రైవర్ బలుసు వెంకటరమణకు (40) తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడిది విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీల దగ్గర బుచ్చింపేట గ్రామంగా గుర్తించారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిండుకుంటున్న నెయ్యి నిల్వలు

▸▸ గత నెలాఖరున ముగిసిన పాత కాంట్రాక్టు ▸▸ ప్రభుత్వ ఉత్తర్వుల కోసం అన్నవరం దేవస్థానం అధికారుల ఎదురుచూపు



అన్నవరం, అక్టోబరు 2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో ప్రసాదం కోసం వినియోగించే నెయ్యి నిల్వలు నిండుకుంటున్నాయి. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి కల్తీ వ్యవహారంతో అన్నవరం దేవస్థానం అధికారులు నెయ్యి వినియోగంపై తర్జనభర్జన పడుతున్నారు. అన్నవరం దేవస్థానానికి ఏటా రెండు లక్షల కిలోల నెయ్యి అవసరమవుతుంది. వరుసగా నాలుగు పర్యాయాలు టెండరు దక్కించుకున్న రైతు డెయిరీ కాంట్రాక్టు సెప్టెంబరు 30తో ముగిసింది. దీనికి సంబంధించి నెల క్రితం అక్టోబరు 1 నుంచి నెయ్యి సరఫరాకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ద్వారా తిరుపతికి చెందిన ఒక సంస్థ ఎల్-1 కాంట్రాక్టుతో టెండరు దక్కించుకోగా ఆ కంపెనీ ఇంకా కొనుగోలు ప్రారంభించలేదు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూడడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా కొనుగోలు చేయాలా, ఇటీవల ఎల్-1 కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ నుంచి కొనుగోలు చేయాలా అనే మీమాంసలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం దేవస్థానంలో నెయ్యి నిల్వలు నిండుకుంటున్నాయి. ప్రస్తుతం ఉన్న నెయ్యి మరో నాలుగు రోజులు వస్తుందని భావిస్తున్నారు. ఈలోగా ఉత్తర్వులు రాకుంటే ప్రసాదం ఎలా తయారు చేయాలో తెలియని పరిస్థితి. అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ ప్రస్తుతం దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉండడంతో కమిషనరుతో చర్చించే అవకాశముంది. కమిషనరు సైతం ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూడాలని, స్వతంత్రంగా నిర్ణయం తీసుకోకూడదని భావిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా నెయ్యి కొనుగోలు చేసేవారు. పదేళ్ల క్రితం ఈ విధంగా చేయగా అప్పటి, ప్రస్తుత ఈవో రామచంద్రమోహన్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీంతో ఆయన కూడా ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయ్‌ప్రకాశ్, కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న బాలికలు

క్రీడా సంరంభం

'శ్రీప్రకాశ్'లో కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాశ్

తుని రూరల్, అక్టోబరు 2: కాకినాడ జిల్లా తునిలోని శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్ర, తెలంగాణ) కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు వందకు పైగా పాఠశాలల నుంచి 1,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. శాప్ రిటైర్డ్ కబడ్డీ కోచ్, ప్రో కబడ్డీ అఫీషియల్ పీవీఎస్‌వీ ప్రసాద్, ప్రో కబడ్డీ అఫీషియల్ బి.మురళీకుమార్, వాలీబాల్ నేషనల్ రిఫరీ బి.శ్రీనివాసరావు, వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు మోహన్‌బాబు హాజరయ్యారు. బాలికలకు అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలను శ్రీప్రకాశ్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాశ్, గౌరవ అతిథులు జాతీయ జెండా, సీబీఎస్ఈ స్పోర్ట్ జెండా, శ్రీప్రకాశ్ జెండాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన బాలికలు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. విజయప్రకాశ్ మాట్లాడుతూ గెలుపు, ఓటమి సహజమని, పోటీల్లో పాల్గొనాలనే క్రీడా స్ఫూర్తి కలిగిన వారంతా విజేతలేనన్నారు. మిమ్మల్ని పోటీలకు పంపిన తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. రెండు రాష్ట్రాల నుంచి హాజరైన జట్ల కెప్టెన్లను, సభ్యులను విజయప్రకాశ్, అతిథులు పరిచయం చేసుకున్నారు. పరిశీలకులు ఎల్.వెంకటరమణ, కె.హేమంత్‌కుమార్‌రావు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ సంస్థల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు

రాజానగరం, అక్టోబరు 2: జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కొనియాడారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నెలకొల్పిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. డిజిటల్ లాప్రోస్కోపిక్ సర్జికల్ యూనిట్‌ను మరో ముఖ్య అతిథి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జనరల్ వార్డులను ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం శుశ్రుత ఆడిటోరియంలో జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ 38 ఏళ్ల కిందట రాజమహేంద్రవరంలో చిన్న సంస్థగా ఆవిర్భవించిన జీఎస్ఎల్ సంస్థలు నేడు ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక వైద్య విధానాలతో విద్యనందించడమే కాకుండా సమాజానికి చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా వైద్య విద్యార్థులు, ప్రముఖులతో ప్రతిజ్ఞ చేయించారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జీఎస్ఎల్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. అతిథులకు గన్ని భాస్కరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గన్ని కాశింబి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గురునాథ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్టు

రాజానగరం, అక్టోబరు 2: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధంలోని చంద్రిక-అవంతిక అపార్ట్‌మెంట్‌లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ బుధవారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన మిట్టని సాయికుమార్, కట్టమూరి యశ్వంత్ వీర నాగ సూర్య శ్రీసత్య సాయి, దుర్గాడ పండు చంద్రిక అవంతిక అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. గంజాయి తాగే అలవాటు ఉన్న కొంతమంది యువకులను పిలిచి, వారికి గంజాయి విక్రయించి, తాగే వరకు ఇక్కడే ఉంచడం వృత్తిగా మలుచుకున్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం సీఐ సిబ్బందితో దాడి చేసి గంజాయి తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. మిగిలిన ముగ్గురికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న ఆయిల్‌తో అధికారులు

నిల్వ స్థావరంపై అధికారుల దాడి

9,400 లీటర్ల ఆయిల్ స్వాధీనం

మామిడికుదురు, అక్టోబరు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడిలంకలో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ ఆయిల్ స్థావరంపై విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేశ్వరరావు ఏ విధమైన అనుమతి లేకుండా తన ఇంటి వద్ద ఆయిల్ నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నాడు. విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి నిల్వ ఉంచిన 9,400లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. సివిల్ సప్లయిస్ డీటీ డి.శ్రీనివాస్, వీఆర్వో రాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును, నిందితులను చూపిస్తున్న సీఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర

చెడు వ్యసనాలకు బానిసలై...చోరీల బాట

వాడపాలేనికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు... రూ.13లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

కొత్తపేట, అక్టోబరు 2: చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీ కోసం చోరీల బాటపట్టిన ఇద్దరు యువకులను బుధవారం అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం బ్యాంకు కాలనీకి చెందిన రామోజు అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి మే 5న రాజమహేంద్రవరం వెళ్లి 9న తిరిగి ఇంటికొచ్చింది. తలుపులు పగులకొట్టి బీరువాలో ఉన్న సుమారు రెండు కిలోల వెండి వస్తువులు, 212 గ్రాముల బంగారు ఆభరణాలు, టైటాన్ వాచ్ చోరీకి గురైనట్టు గుర్తించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచనల మేరకు కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది.. కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన బండారు మణికంఠ, చింతపల్లి వెంకట్రాజు అనే యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును త్వరితగతిన చేధించిన సీఐ విద్యాసాగర్, సీసీఎస్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సురేంద్ర, సీసీఎస్ ఏఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సీ బీఎస్ స్వామి, సిబ్బంది ఎం.వీర్రాజు, ఆర్.సుబ్రహ్మణ్యం, జి.కృష్ణసాయి, బి.అర్జునరావు, ఎస్.బ్లెషన్‌లను ఎస్పీ అభినందించారు.



మొసలిని డ్యామ్‌లోకి వదులుతున్న హోంగార్డు రామన్నదొర

అమ్మో! మొసళ్లు

డొంకరాయి డ్యామ్‌పై సంచారం

సాహసించి పట్టుకున్న హోంగార్డు

మోతుగూడెం, అక్టోబరు 2: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి డ్యామ్‌పై అర్ధరాత్రి వేళ మొసళ్లు సంచరిస్తున్నాయి. ఓ హోంగార్డు డ్యూటీ నిర్వహిస్తుండగా ఏదో అలికిడి అయిన శబ్దం వినిపించింది. పరిశీలించగా డ్యామ్‌పై రెండు మొసళ్లు కనిపించడంతో సహచర హోంగార్డులకి సమాచారం అందించాడు. వారు హుటాహుటిన మొసళ్లు సంచరిస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు. హోంగార్డుల అరుపులకు ఒక మొసలి డొంకరాయి రిజర్వాయర్‌లోకి దూకేసింది. హోంగార్డు ఎస్.రామన్నదొర సాహసం చేసి అరడుగుల పొడవున్న ఉన్న మొసలిని పట్టుకున్నాడు. దాని మూతికి తాడు కట్టి ఈడ్చుకుంటూ వెళ్లి రిజర్వాయర్‌లోని నీటిలో వదిలిపెట్టాడు. సాహసం చేసిన హోంగార్డు రామన్నదొరను ఏపీ జెన్‌కో ఉద్యోగులు, గ్రామస్థులు అభినందించారు.



కొడవలి పుష్కర కాలువలో గల్లంతైన సతీష్ కోసం గాలిస్తున్న దృశ్యం

పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 2: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతయ్యాడు. కొడవలి గ్రామానికి చెందిన ఉప్పనబోయిన సతీష్ (15) తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. అక్కడ పుష్కర కాలువలోకి దిగి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు సతీష్ ఆచూకీ లభించలేదు.



దాత సమర్పించిన నూతన పట్టు వస్త్రాలతో అర్చకులు, అధికారులు

రూ.3 లక్షలు విలువైన
పట్టు వస్త్రాలు అందజేత

అన్నవరం, అక్టోబరు 2: శరన్నవరాత్రులను పురస్కరించుకుని రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు, శంకరుడు, సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు బుధవారం ఒక దాత రూ.3లక్షలు విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు వీటిని ఆలయ సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి సుధీర్, బీఎస్ రాంబాబు పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను నవరాత్రుల్లో అలంకరిస్తామని ప్రధానార్చకుడు చెప్పారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సుప్రీంకోర్టుకు సిఫార్సు చేస్తాం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు వారి పేర్లను సుప్రీంకోర్టుకు సిఫార్సు చేస్తామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మహిళా ప్రత్యేక కారాగారంలో బుధవారం నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. మహిళా ఖైదీల సమస్యలను, కేసు వివరాలను తెలుసుకుని తగు న్యాయం చేస్తామన్నారు. మహిళా జైలు వాతావరణం సబర్మతి ఆశ్రమాన్ని తలపిస్తోందని వక్తలు ప్రశంసించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు పీడీజే బహుమతులు అందజేశారు. అనంతరం కేంద్ర కారాగారంలో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి హాజరయ్యారు. జైలులో ఖైదీల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వివిధ వస్తువుల తయారీ యూనిట్లు, నర్సరీ, నైపుణ్య శిక్షణను జైలు అధికారులు పీడీజేకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఆర్.శ్రీలత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు, మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంతకుమారి, కేంద్ర కారాగార ఉప పర్యవేక్షణాధికారి ఎం.రాజ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, జైలర్ పావని తదితరులు పాల్గొన్నారు.



పాదగయ ఆవరణలో పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు

పిఠాపురం పాదగయకు
పోటెత్తిన భక్తులు

మహాలయ అమావాస్య సందర్భంగా పిండ ప్రదానాలు

పిఠాపురం, అక్టోబరు 2: కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి బుధవారం భక్తులు పోటెత్తారు. పితృ పక్షాలుగా వ్యవహరించే ఈ సమయంలో మహాలయ అమావాస్యకు విశేష ప్రాధాన్యత ఉంది. పితృ దేవతలకు ఈ రోజున పిండ ప్రదానాలు చేస్తే మంచిదనే నమ్మకంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి పిండ ప్రదానాలు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు పలువురు ప్రముఖులు పిండ ప్రదానాలు చేసేందుకు వచ్చారు. బైపాస్‌తో పాటు పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వాహనాలను బారులుతీరి నిలిపారు. పాదగయ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మహాలయ అమావాస్య సందర్భంగా పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి దేవస్థానానికి బుధవారం ఒక్కరోజు రూ.5.89 లక్షల ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథ రాజు తెలిపారు. పిండ ప్రదానాల టిక్కెట్ల ద్వారా రూ.2,46,500, అన్నదానం ద్వారా రూ.2,34,472, గ్రోగాసం టిక్కెట్ల ద్వారా రూ.4,602, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.47,825, పూజా టిక్కెట్ల ద్వారా రూ.55,360 వచ్చాయి.

విలీన మండలాల్లో ప్రారంభమైన
బతుకమ్మ సంబరాలు

ఎటపాక, అక్టోబరు 2: విలీన మండలాల్లో బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తోటపల్లి, సీతాపురం, గౌరిదేవిపేట, చోడవరం, నెల్లిపాక, నందిగామ తదితర గ్రామాల్లో మహిళలు, బాలికలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. తొలి రోజు వెంగిలి బతుకమ్మను ఏర్పాటు చేసి బతుకమ్మలను ఎత్తుకుని మహిళలు ప్రదక్షిణలు చేశారు. సంబరాలు తొమ్మిది రోజులు జరుగుతాయి.



తోటపల్లిలో బతుకమ్మను ఎత్తుకుని పాటలు పాడుతున్న బాలికలు

ఏజెన్సీ సమాచారం



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

'గాంధీజీని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి'

రంపచోడవరం, అక్టోబరు 2: సత్యం, అహింసలను అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన మహాత్మా గాంధీని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కోరారు. అంబేడ్కర్ సెంటర్లోని గాంధీజీ విగ్రహానికి ఆమె పుష్పమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెన్‌కో కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఘనంగా గాంధీ జయంతి

మోతుగూడెం, అక్టోబరు 2: ఏపీ జెన్‌కో కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు పూలమాల వేశారు. చీఫ్ ఇంజనీర్ కార్యాలయ సూపరింటెండెంట్ చిన్న కామేశ్వరరావు, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరప్రసాద్, జేఏవో వేమగిరి కిరణ్, ఇ.ఆనంద్‌బాబు, సురేష్ పాల్గొన్నారు. డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జెన్‌కో ఉద్యోగస్తులు టి.ప్రసాద్ రామారావు, పూర్ణిమ పాల్గొన్నారు.

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీడీవో బాపన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మిక వర్గానికి చెందిన సైనం ప్రసాద్ దంపతులను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కూనవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఈవో సురేష్‌కుమార్ పూలమాల వేశారు. సర్పంచ్ హేమంత్, వీఆర్వో వెంకన్న పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఎటపాక, అక్టోబరు 2: గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సచివాలయాల పరిధిలో పారిశుధ్యం మెరుగుకు సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను బుధవారం సత్కరించారు. గన్నవరం సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్మికులు పిడియాల దుర్గాప్రసాద్, అలవాల తిరుపతయ్యలను సెక్రటరీ స్వాతిదేవి, సర్పంచ్ గడ్డం భద్రమ్మ సన్మానించారు. ఎంపీటీసీ కంటే రాజు, టీడీపీ నాయకుడు బొల్లా పుల్లయ్య పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి పుష్పమాల వేస్తున్న డీసీహెచ్ఎస్ కృష్ణారావు

50 పడకల ఆసుపత్రి కోసం ప్రతిపాదనలు పంపండి : డీసీహెచ్ఎస్

కూనవరం, అక్టోబరు 2: చింతూరు ఏరియా ఆసుపత్రిని వంద పడకలుగా, కూనవరం మండలం కోతులగుట్ట సీహెచ్‌సీని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడం కోసం ప్రతిపాదనలు పంపాలని అల్లూరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటరును సందర్శించారు. గాంధీజీ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్య సిబ్బంది సేవలందించాలన్నారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. తమకు ప్రతినెలా సక్రమంగా జీతాలు అందేలా చూడాలని సెక్యూరిటీ సిబ్బంది కోరారు. సూపరింటెండెంట్ కోటిరెడ్డి, డాక్టర్ తేజ, డాక్టర్ వివేక్‌నాయక్, హెడ్ నర్సు బొజ్జి, జోగారావు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం



కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే

దేవీపట్నం, అక్టోబరు 2: మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో జనసేన నాయకులు ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ప్రారంభించారు. రాజమహేంద్రవరం అగర్వాల్ ఐ ఆసుపత్రి, శ్రీసాయిరామ్ డెంటల్, మోహన్ డయాబెటిక్, హెలియోస్ ఆసుపత్రి వైద్యులు 250 మందిని పరీక్షించారు. కూటమి నాయకులు కట్టమూరి వీరబాబు, కర్రి మహేష్, సర్పంచ్ కుంజం రాజామణి పాల్గొన్నారు.


వినతుల వెల్లువ



అనంతరం ఎమ్మెల్యే శిరీషదేవి, మఠం విజయ్ భాస్కర్‌లకు పోలవరం ముంపునకు గురైన 44 గ్రామాల నిర్వాసితులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, లంకా హరిశ్చంద్రుడు, గేదల పెదసుబ్బారావు, చినసుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 9లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్



రంపచోడవరం, అక్టోబరు 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నూతన మద్యం విధానం 2024-26 ప్రకటించిన నేపథ్యంలో రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను రంపచోడవరం ఎక్సైజ్ కార్యాలయం లేదా https://hpfsproject.com వెబ్‌సైట్‌లో ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు రూ.2 లక్షలు డీడీని జతపర్చాలన్నారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్, పాడేరు పేరున డీడీ తీయాలని సూచించారు. ఈ నెల 11వ తేదీన పాడేరు ఎస్పీ ఆఫీస్ రోడ్డులోని వీఆర్ ఫంక్షన్ హాలులో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



కలెక్టరేట్‌లో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మహాత్ముల ఆశయాలు

ఆచరణీయం

- అదే వారికి మనమిచ్చే ఘనమైన నివాళి: కలెక్టర్
- మహాత్మగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి
- అధికారులు, నాయకుల నివాళులు
- పలుచోట్ల స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 2: మహాత్ముల ఆశయాలను ఆచరణలో చూపడమే వారికి మనమిచ్చే ఘనమైన నివాళి అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మహాత్మగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ చిన్న రాముడుతో కలిసి వారి చిత్రపటాలకు కలెక్టర్ పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛభారత్ కోసం గాంధీజీ కలలు కన్నారన్నారు. ఆడపిల్లలు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగినపుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చిందని పలు సందర్భాల్లో పేర్కొన్నారని, స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్లు పూర్తయినా పూర్తి స్థాయిలో వారి కలలు సాకారం కాలేదన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు కర్తవ్యంగా పరిసరాల పరిశుభ్రతపై వ్యక్తిగత దృష్టి సారించాలన్నారు. మహాత్ముల జీవితం తెలుసుకొని భావితరాలకు అందించే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలని జేసీ చిన్న రాముడు అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరశింహులు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. డీన్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ అహింసే ఆయుధంగా నడచిన మహనీయుడు మహాత్మగాంధీ అని అన్నారు. కార్యక్రమంలో పి.ఉమామహేశ్వరి, సీహెచ్ సునీత, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం రఫీయుద్దీన్, ఉపాధ్యాయులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆకుల సుధాకర్, నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్, మద్దుకూరి గోపి పాల్గొన్నారు. మురమండ ఏఎంజీ నగర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. షేక్ వలీ మీరా, షేక్ మీరాబాయి, పిల్లా వెంకట్రావు పాల్గొన్నారు.

రామహేంద్రవరం కల్చరల్: సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆర్యాపురం డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు పార్కులోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



గాంధీ విగ్రహం వద్ద నివాళుర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్ మాట్లాడుతూ దేశనాయకుల గురించి తెలుసుకొనేలా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ముద్రించాలని కోరారు. కార్యక్రమంలో మహంతి లక్ష్మణరావు, కేకే సంజీవరావు, జామిశెట్టి అప్పాజీ, కాసాని శంకరరావు పాల్గొన్నారు. స్థానిక టౌన్‌హాల్ జుబ్లీ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లోని గాంధీ, నెహ్రూ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, టౌన్‌హాల్‌ను శుభ్రం చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, యర్రా వేణుగోపాల్‌నాయుడు, పంతం కొండలరావు, కూరగంటి సతీష్ పాల్గొన్నారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బార్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, వైస్ ప్రెసిడెంట్ నగదేవర స్వర్ణపాపా, జనరల్ సెక్రటరీ పెళ్ళూరి రమేష్ మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్(రాకా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ రెట్రో రాగాస్ యూట్యూబ్ అధినేత వీఎస్ మూర్తి విచ్చేసి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేవీ పూర్వ అధికారి దుర్గాప్రసాద్, రాకా అధ్యక్షుడు సూరపురెడ్డి తాతారావు, జీవీ రమణ,సభ్యులు రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఆలిండియా రీజనల్ రూరల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐఆర్‌ఆర్‌బీఈఏ) పిలుపు మేరకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారుల, ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు. అధికారుల సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులు ఆవిర్భవించి 50వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఏఐఆర్‌ఆర్‌బీఈఏ పిలుపు మేరకు గోల్డెన్ జూబ్లీ వేడుకలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సాగర్, శంకర్, రామారావు, అనుదీప్, పైడిరాజు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: మహాత్ముడు కలలుగన్న గ్రామస్వరాజ్యం, స్వచ్ఛభారత్ సాధన కోసం వైద్య, ఆరోగ్యవిభాగం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆసుపత్రిలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించి మినిస్టీరియల్, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బందితో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఎంవో ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్ర



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

మాన్ని నిర్వహించారు. గోదావరి గట్టున మార్కండేయేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న గోదావరి నదీ ఘాట్‌లోని చెత్త, ఇతర వ్యర్థాలు, ప్లాస్టిక్ వంటి వాటిని తొలగించి శుభ్రం చేశారు. పేపర్‌మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్‌జైన్, సీనియర్ వైస్ ప్రెశిడెంట్ (ఆపరేషన్స్) ఎం.సూరారెడ్డి, ఇతర సీనియర్ నాయకత్వ బృందం, మిల్లుకు చెందిన సుమారు 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. మహాత్ముని సిద్ధాంతాలను, ఆయన ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక మూలగొయ్యి సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. పేదలకు రగ్గులు పంచారు. ఎన్ఎస్ఎస్ పీవోలు, ఫ్యాకల్టీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: కంబాలచెరువు, దానవాయిపేట తదితర ప్రాంతాల్లో మహాత్మాగాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ అహింసా మార్గం ఆచరణీయమని, ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రజల స్వేచ్ఛ కోసం తామంతా ఆయన మార్గంలోనే పోరాటం చేశామన్నారు. అలాగే కంబాలచెరువు వద్ద కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ. గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి కమిషనర్ కేతన్ గార్గ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనం చేసే పనులను మన పిల్లలు గమనిస్తారని, ప్రతీ పని నిబద్ధతతో చేస్తే వారికి ఆదర్శంగా నిలుస్తామన్నారు. అనంతరం స్వచ్ఛత హి సేవలో భాగంగా పారిశుధ్య సిబ్బందిని, ఉద్యోగులను, అధికారులను అభినందించి ప్రశంసాపత్రాలను కమిషనర్ అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డీడీ రామారావు, ఈఈ మదర్షాఅలీ, రుడా సీపీవో మూర్తి, సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజరు అబ్దుల్ మాలిక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామంలో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి గాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఇందల వీరబాబు, కొర్ల వినాయకరావు, మహిపాల సోమినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఊలపల్లిలో సర్పంచ్ బండారు రమ్య టీడీపీ నాయకుడు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ సామాగ్రి, అంగన్వాడీ సెంటర్లకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ, హెచ్ఎం పి.వీరప్రభాకరరావు గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కొంకుదురు హైస్కూల్లో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళుర్పిస్తున్న రాకా అధ్యక్షుడు వీరన్నచౌదరి

అనపర్తి: అనపర్తిలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. అలాగే లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అహింస ఆయుధంగా దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన గాంధీజీ మహాత్ముడిగా నిలిచారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పులగుర్త చేనేత వస్త్రాల స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించి వస్త్రాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో సిరిసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో హిమమహేశ్వరి, ఈవోపీఆర్డీ పద్మజ పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీయూఎస్ఎంఏ) ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక హర్షవర్ధన విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో కానవరంలోని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ ఎన్‌వీవీవీఎస్ మూర్తి, దివ్య విద్యాసంస్థల చైర్మన్ బర్ల సత్యనారాయణ, హర్షవర్ధన స్కూల్ డైరెక్టర్ గొంతిన అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో గాంధీజీ పొట్టి శ్రీరాముల విగ్రహాలకు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు టి.కుశలవదొర, సుజాత, ఎస్ఎంసీ చైర్మన్ తెలగంశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు. గాదరాడ వీరభద్రపురం పాఠశాలలో హెచ్ఎం ప్రసాద్‌బాబు పలువురు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. నర్సాపురంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. రాయిపాటి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి నాగరత్నం పాల్గొన్నారు. అలాగే గాడాల, జంబుపట్నం, రాఘవాపురం, నర్సాపురం పాఠశాలల్లో గాంధీ జయంతి నిర్వహించారు.

రంగంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.వెంకటరత్నం, విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, రంగంపేట హైస్కూల్లో హెచ్ఎం పార్థసారధి గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు శుభ్రం చేసి గాంధీ జయంతి నిర్వహించినట్టు ఎంఈవోలు చెప్పారు.

ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలి : ఆర్డీవో

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 2: స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా ప్రతిఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే, సబ్ కలెక్టర్ కార్యాలయం, ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, ఇతర కార్యాలయాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

నన్నయ వర్శిటీ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 1: మహనీయులను ఆదర్శంగా తీసుకుని జీవిస్తూ భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా ఉండాలని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సూచించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గాంధీజీ, లాల్‌బహుద్దూర్ శాస్త్రిల జయంతిని ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహంతో గాంధీజీ దేశవ్యాప్తంగా చైతన్యాన్ని నింపారని, అహింసతో స్వాతంత్య్రాన్ని సాధించారన్నారు. దేశంలో ప్రజలకు ఎక్కువ స్వేచ్ఛ ఉందని, దానిని సద్వినియోగం చేసుకుంటూ సమాజహితంగా జీవించాలన్నారు. స్వాతంత్య్రం అనంతరం లాల్‌బహుద్దూర్ శాస్త్రి దేశాభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వర్శిటీ అధికార్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల ఖాదీ శారీ వాక్

రాజమహేంద్రవరం కల్చరల్ అక్టోబరు 2: గాంధీ జయంతి సందర్భంగా.. గాంధీజీ ఖాదీ ఉద్యమం ప్రారంభించి 106 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 106 మంది మహిళలతో ఖాదీ శారీవాక్ జరిగింది. కోటిపల్లి బస్టాండ్‌లోని స్వాతంత్య్ర సమరయోధుల పార్కు నుంచి సరస్వతీ ఘాట్‌లోని భరతమాత విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఖాదీలో ప్రధాన భాగస్వామ్యం వహించిన చరక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఖాదీకి పూర్వవైభవం తెచ్చేందుకే మహిళలతో ఖాదీ శారీ వాక్ నిర్వహించినట్టు ఆంధ్ర కేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో పిల్లి నిర్మల, పి.లక్ష్మీశ్రీనివాస్, మాటూరి మంగతాయారు, రాజమహేంద్రి ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సౌందర్య, మహిళా బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి కుమారి, సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, దూర్వాసుల సత్యనారాయణ, క్రొవ్విడి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ నిరంతర ప్రక్రియ

- స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి



రంగంపేటలో చీపురుతో రోడ్లు ఊడుస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి/రంగంపేట, అక్టోబరు 2: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పక్షం రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల ముగింపు సందర్భంగా బుధవారం అనపర్తి మెయిన్ రోడ్డు, రంగంపేటలో అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. రంగంపేటలో రాజానగరం జీఎస్ఎల్ డెంటల్ మెడికల్‌కాలేజ్ అండ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, జీఎస్ఎల్ డెంటల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గోదావరి రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ నాయకుడు సోము వీర్రాజు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ నాగేంద్రకుమార్, ఎ.రంగబాబు, ఆర్.గోపికృష్ణ, ఎం.శ్రీనివాస్, లలిత్‌కుమార్ జైన్, ఎం.ఉమాదేవి, రైల్వే అడ్వైజరీ బోర్డు సభ్యులు ఎం.కృష్ణమాచార్యులు, బి.సురేంద్రకుమార్, కె.సురేష్, సీహెచ్ సతీష్ పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను విస్మరించొద్దు

బ్రౌన్ మందిరం వద్ద గాంధీ జయంతిలో పద్మవిభూషణ్ యార్లగడ్డ



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 2: మహనీయుల త్యాగాలను విస్మరిస్తే జాతి మనుగడ ఉండదని పద్మవిభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హెచ్చరించారు. స్థానిక సీపీ బ్రౌన్ మందిరంలో బుధవారం జరిగిన గాంధీ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గాంధీజీ లండన్‌లో చదువుకునే రోజుల్లో కాలేజీకి బాపూజీ కట్టిన రశీదును ఫ్లెక్సీ రూపంలో తయారు చేసి సన్నిదానం శాస్త్రి అందించారు. యార్లగడ్డ మాట్లాడుతూ గీతానుసారం అందించిన శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు, మహ్మద్ ప్రవక్త, గౌతమబుద్ధుడు, మహాత్మాగాంధీ ఇప్పటికీ ఆరాధనలో ఉన్నారన్నారు. భారత దేశ ఉభయ సభల్లో అమెరికా అధ్యక్షుడు ఒబామా మాట్లాడిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. నల్లజాతియుడైన తాను అమెరికా అధ్యక్షుడిగా శ్వేత సౌధానికి వెళ్లడానికి మార్గదర్శకులు గాంధీజీ అని చెప్పడం దేశ ఔన్నత్యాన్ని తెలుపుతుందన్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ దంపతులను సన్నిదానం శాస్త్రి, భార్గవి దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో వెంపాటి విశ్వనాథం, నిమ్మలపూడి గోవింద్, నిమ్మగడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

కేంద్ర కార్మిక సంఘాల నిరసన దీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 2: విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు సెంటర్ వద్ద కేంద్ర కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.జోజి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సీహెచ్ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.పవన్ మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎల్ఐసీ, సీఐటీయూ, రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 2: వరద బాధితుల సహాయార్థం పలువురు ఆర్థిక సాయం అందించారు. స్థానిక వెంకటేశ్వరనగర్ జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.80 వేలు, ఉష లేడీస్ సభ్యులు రూ.43 వేలును ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ద్వారా సీఎం సహాయనిధికి అందజేశారు. కార్యక్రమంలో జవహర్ వాకర్స్ క్లబ్, ఉష లేడీస్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది ఎంపిక

బిక్కవోలు, అక్టోబరు 2: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు పందలపాక ఉన్నత పాఠశాల ప్లస్ నుంచి పది మంది విద్యార్థినులు ఎంపికయ్యారని పీడీ డి.యువరాజారెడ్డి బుధవారం తెలిపారు. కాకినాడలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి అండర్-19, 17, 14 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన భవాని, దివ్య, శశి, లోహిత, ప్రియ, సుస్మిత, జాహ్నవి, ఉమావైష్ణవి, లీలాశైలజ, సంతోష్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, తీర్చిదిద్దిన పీడీ యువరాజారెడ్డిని సర్పంచ్, ఉపసర్పంచ్‌లు సబ్బారపు పద్మావతి, పడాల వెంకటరామారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు, హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి అభినందించారు.

చాంబర్ తొలి మహిళా డైరెక్టర్ కుమారి



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 2: రాజమహేంద్రవరంలో 75ఏళ్ల చరిత్రలో ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఇటీవల జరిగిన ఏకగ్రీవ ఎన్నికలో టీడీపీ నాయకురాలు కొయ్యన కుమారి రికార్డును కైవసం చేసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో మహిళలెవ్వరు డైరెక్టర్‌గా ఎన్నిక కాలేదు. తొలిసారిగా కుమారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను లయన్స్ క్లబ్ రాజమండ్రి మహిళా తరపున పీడీజీ మాటూరి మంగతాయారు, రీజనల్ చైర్‌పర్సన్ మదునూరు వాణిశ్రీ, క్లబ్ అధ్యక్షురాలు అల్లాడ కవిత, గొందేసి మాధవీలత, అరుణకుమారి, భవాని, సీర లక్ష్మి, పద్మావతి అభినందించారు.

నేటి నుంచి శ్రీప్రకాష్‌లో వాలీబాల్ పోటీలు

దివాన్‌చెరువు, అక్టోబరు 1: సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలకు దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఈ నెల 3వ నుంచి 4 రోజులు పాటు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 110కి పైగా పాఠశాలల నుంచి 1400 మందికిపైగా క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొననున్నారు. అండర్14, 17, 19 విభాగాల్లో ఈ పోటీలకు రిఫరీస్‌గా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది వస్తారని శ్రీప్రకాష్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి సీహెచ్‌వీ జయప్రకాష్, టోర్నమెంట్ కన్వీనర్ ఎస్.గంగాధర్ తెలిపారు.

భగవద్గీత ప్రవచనం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 2: భగవద్గీత ఆధ్యాత్మిక జ్ఞానం సాధకుల్లో సమూలమైన సంస్కరణను తీసుకొస్తుందని, ఈ జ్ఞానం వల్లనే మానవాళి అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఆధ్యాత్మిక ప్రవచన కర్త వివేకానంద ప్రబోధించారు. బుధవారం సాయంత్రం స్థానిక నిర్మల గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భగవద్గీత ప్రవచనం అనే అంశంపై ఆయన మాట్లాడారు. భగవద్గీత పారాయణం ఆత్మజ్యోతిని వెలిగిస్తుందని, అన్ని సమస్యలను పరిష్కరించే శక్తి ఆధ్యాత్మిక జ్ఞానానికి ఉందని అన్నారు. ఈ జ్ఞానాన్ని నేర్చుకోవడానికి, లింగ, వయో భేదం లేదని, అందరు నేర్చుకొని ఆచరించాలని చెప్పారు. అనంతరం మల్లిటి సత్యనారాయణ రెడ్డి,విజయలక్ష్మి దంపతులు వివేకానందను సత్కరించారు.







బా..పూజనీయుడు..

గాంధీ తాత.. ఆ తరం నుంచి నేటి తరం వరకూ అందరికీ తాత..మన జాతిపిత.. మన జీవితంలో ఒక భాగం గాంధీ అంటే.. నాటికి.. నేటికీ బా..పూజనీయులే.. ఎందుకంటే తరాలు మారినా ఆశయాలతో చెరగని ముద్ర వేశారు.. నేటికీ ముందుండి నడిపిస్తున్నారు.. గాంధీ జయంతిని బుధవారం ఊరూవాడా పండుగలా చేశారు. ఈ చిత్రంలోనే చూడండి కడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎండను సైతం లెక్కచేయకుండా గాంధీకి నివాళిగా ఇలా చేశారు.. నిను మరువం బాపూ అంటూ చెప్పకనే చెప్పారు.. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నీ బాటలో నడుస్తాం అంటూ నివాళులర్పించారు. చిత్రంలో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును చూడవచ్చు.. - వివరాలు 8లో

దేవీ వైభవం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 2 : రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి 91వ శరన్నవ రాత్రి మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రా రంభమయ్యాయి. ఆలయ అర్చకులు దేవినవరాత్రి ఉత్సవ కమిటీ పెద్దల సమక్షంలో రాత్రి 9.09 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. మైసూర్ తర్వాత దసరా ఉత్సవాలు రాజమహేంద్రవరంలో ఘనంగా జరుగుతాయి. విజయవాడ కనకదుర్గమ్మతల్లి ఆలయం శిఖరం ఆకారంలో భారీ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలంకరణ సెట్టింగ్‌లు ఆకర్షణగా నిలిచాయి.తొలిరోజే పెద్ద ఎత్తున భక్తజనం హాజరై అమ్మవారిని కొలిచారు.9 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



దేవీచౌక్‌లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన.. ఆలయం వద్ద విద్యుద్దీపకాంతులు

దేవీచౌక్‌లో ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): దేవీ చౌక్‌లో గురువారం నుంచి 15వ తేదీ వరకూ ట్రాఫిక్ మళ్లిస్తున్నామని ఎస్పీ నర సింహ కిషోర్ తెలిపారు.వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండ్‌కు వెళ్లే వాహ నదారులు చిరంజీవి బస్టాండ్, స్వతంత్ర హాస్పటల్ దారిలో వెళ్లాలి.గోకవరం బస్టాండ్ నుంచి వై.జంక్షన్ వచ్చే వాహనాలు సౌతిండియా షాపింగ్ మాల్ నుంచి తుమ్మలోవ గుండా ప్రయాణించాలి.పేపర్‌మిల్ నుంచి జాంపేట వెళ్లే వాహ నాలు తుమ్మలోవ, కంబాలచెరువు, జాంపేట నుంచి పేపర్‌మిల్లు వైపు వెళ్లేవి నందం గనిరాజు జంక్షన్, కంబాల చెరువు, మెయి న్ రోడ్ నుంచి కంబాల చెరువు వెళ్లే వాహనాలు జండాపంజా రోడ్, జాంపేట దారిలో రాకపోకలు సాగించాలి.

రానున్న పుష్కరాల ట్రాఫిక్‌పై దృష్టి : ఎంపీ

రాజానగరం, అక్టోబరు 2 : రానున్న పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏవిధమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు.ఈ మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్, కమిషనర్, పోలీసులతో ఇప్పటికే సమీక్షించానన్నారు. పుష్కరాలకు దాదాపుగా ఐదు కోట్ల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. రాజమహేంద్రవరం ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.



గ్యాస్..దోపిడీ!

డెలివరీకి ఏ అదనపు చార్జ్

వంట గ్యాస్‌పై దర్జాగా దోపిడీ. అయినా అడిగేవారు లేరు. ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు. వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. వినియోగదారుడు గ్యాస్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఏజెన్సీ నిర్వాహకులు ఇంటికే సిలిండర్ సరఫరా చేయాలి. అసలే గ్యాస్ ధర సామాన్యుడి ఇంట్లో మంట పెడుతుంటే మరో పక్క అదనపు చార్జీలు భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.832 ఉంటే డెలివరీ బాయ్ దూరాన్ని బట్టి రూ.870 నుంచి రూ.900ల వరకూ వసూలు చేస్తున్నాడు. అంటే రూ.40 నుంచి రూ.70 వరకూ తీసుకుంటున్నారు. ఒక్క రూపాయి డెలివరీ బాయ్‌కి చెల్లించనక్కర్లెద్దు. కేవలం బిల్లులో ఎంత ఉంటే అంతే చెల్లించాలి..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను బహిరంగంగా మోసం చేస్తున్నాయి. డెలివరీ పేరిట అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయి.ఈ మొత్తం ఎవరి జేబుల్లోకి వెళుతుందో తెలియదు కానీ వినియోగదారులు మాత్రం మోసపోతున్నారు. వినియోగదారుడు గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటికే సరఫరా చేయాలి. ఎంత దూరంలో ఉన్నా అదనపు చార్జీలు వసూలు చేయకూ డదు. గ్యాస్ సరఫరా చేసే డెలివరీ బాయ్స్‌కు ఏజెన్సీలే జీతాలు చెల్లించాలి.అయితే డెలివరీ పేరిట అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు.ఏజెన్సీ పక్కనే ఇల్లు ఉన్నా ఇదే తీరు. ప్రస్తుతం డొమెస్టిక్ వంట గ్యాస్ 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.832గా ఉంది. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.1785గా ఉంది. ఇది వాణిజ్య గ్యాస్ ధర.ఇక 5 కేజీల సిలెండర్ ధర రూ.541గా ఉంది. కానీ గ్యాస్ సరఫరా చేసినందుకు డెలివరీ బాయ్స్ అదనంగా రూ.30 నుంచి రూ.80 వరకూ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పైసా కూడా అదనంగా వసూలు చేయకూడదు.

జిల్లాలో 6,24.265 కనెక్షన్లు

జిల్లాలో హెచ్‌పీసీఎల్ కంపెనీకి 21 ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 4,60,465 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఐవోసీఎల్ కంపెనీకి 12 ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,26,793 కనెక్షన్లు ఉన్నాయి. బీపీసీఎల్ కంపెనీకి 3 ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధి లో 37, 007 కనెక్షన్లు ఉన్నాయి.ఇలా జిల్లాలో మొత్తం 6,24,265 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.వీరంతా డెలివరీ బాయ్స్‌కు సగటున రూ.30 ఇచ్చినా జిల్లాలో నెలకు రూ .1,87,27,950 ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నట్టే. ఇది ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉంది.దీనిపై ప్రజల్లో తీవ్ర ఆందోళన ఉంది.కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో ఆ అక్రమ వసూళ్లను అరి కట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో కూడా ఏజెన్సీలు లేవు. వాటిని విస్త రించి,అక్రమాలు అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

- గ్యాస్ ధర రూ.832 మాత్రమే
- దూరాన్ని బట్టి అదనపు వసూళ్లు
- డెలివరీ పేరిట రూ.40 నుంచి రూ.70
- రూపాయి కూడా చెల్లించనక్కర్లెద్దు
- జిల్లాలో 6.24 లక్షల కనెక్షన్లు
- రూ.30 లెక్క వేసినా రూ.1.87 కోట్లు
- పట్టించుకోని అధికారులు
- అవగాహన లేని వినియోగదారులు

గ్యాస్ డెలివరీకి అదనపు చార్జీల్లేవ్..

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు సిలిండర్ సరఫరా చేసినందుకు చార్జీల కింద ఒక పైసా కూడా ఇవ్వనవసరం లేదు. కేవలం గ్యాస్ బిల్లులో ఉన్న డబ్బు ఇస్తే చాలు. అంటే ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.832లు. ఆ మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. డెలివరీ బాయ్స్ చార్జీలన్నీ ఏజెన్సీలు భరిస్తాయి.

- ఎం.నాగాంజనేయులు, ఇన్‌చార్జి డీఎస్‌వో.

సిలిండర్‌కు రూ.50 అదనంగా వసూలు



గ్యాస్ సిలిండర్ ధర రూ.832 ఉంది. దానిపై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధర ఆకాశంలో ఉంది. అదనంగా డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో సిలిండర్‌కు రూ.50 నుంచి రూ.70 వసూలు చేస్తున్నారు. అలా ఇవ్వాలేమో అనుకుంటున్నా.. ఇవ్వకూడదని నాకు తెలియదు. అధికారులు స్పందించి అదనపు చార్జీలు వసూలు చేయకుండా చూడాలి.

- చిట్టాబత్తుల కృష్ణవేణి, రాజమహేంద్రవరం.

అదనపు వసూళ్లు దారుణం..



గ్యాస్ ధర భారీగా పెంచేయడంతో ఇబ్బందిపడుతున్నాం. సిలిండర్ ధర ప్రస్తుతం రూ.832గా ఉంది. అయితే డెలివరీ చార్జీలతో కలిపి రూ.870 నుంచి రూ.890 వరకు తీసుకుంటున్నారు. డెలివరీ చార్జీలు లేవని నాకు తెలియదు. ప్రతి నెలా ఇంతే. ధర పెంచినా డెలివరీ చార్జీ తీయలేదేంటా అనుకునే దానిని.. డెలివరీ చార్జీలు లేకుండా వసూలు చేయడం దారుణం. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- అల్లక అరుణకుమారి, వీరవరం.



స్వచ్ఛ భారత్‌కు పునరంకితమవుదాం

స్వచ్ఛతా హీ సేవ ముగింపులో ఎంపీ పురందేశ్వరి



కోటిపల్లి బస్టాండ్‌లో శుభ్రంచేసి చెత్త ఎత్తుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 2 : స్వచ్ఛభారత్ నిర్మాణంలో మనందరం పునరంకితం అవుదామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్ సాకారం చేసుకోవడానికి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల ద్వారా వారిలో అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు.రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో బుధవారం స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలసి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రధాని మోదీ పదేళ్ల కిందట స్వచ్ఛభారత్‌కు పిలుపు ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో వినూత్న, ఆర్డీసీ జిల్లా అధికారిణి షర్మిళ అశోక, తహశీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పాటుపడదాం : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 2 : గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునిచ్చారు. రూరల్ మండలం బొమ్మూరులో నిర్వహించిన స్వచ్ఛత హి సేవ ముగింపు వేడుక నిర్వహించారు. ముందుగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల్లో పరిశుభ్రత అత్యంత కీలకమైన అంశం అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి విజన్-2047 ప్రతి పాదనలు ఆమోదించామని డీపీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు భాగ స్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహణలో 9 అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీనివాసరెడ్డి(బొమ్మూరు కార్యదర్శి), ఎంఈపీ నెహ్రూ(నెలటూరు), కె.రమేష్(కోరుకొండ), ఎస్‌కే.ఇమాంమున్నీషా బేగం (ముక్కినాడ), ఎస్.సాయికిషోర్(అనపర్తి), బి.రత్నం(దూబచర్ల), ఆర్.సుజాత(వంగలపూడి), పి.హరీష్ బాబు(జగన్నాథపురం),డి. ముత్యం(ఐపంగిడి) పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులను సత్కరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు,డీఎల్‌పీవో నాగలత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల



ఇసుక తీతకు.. సహకారమేది!

ఇంకనూ పూర్తికాని బోట్స్‌మన్ సొసైటీల ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ,అక్టోబరు 2: జిల్లాలో గోదావరి ఇసుక తీత పనులు చేసుకుంటూ జీవనం సాగించిన బోట్స్‌మెన్స్ సొసైటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో కొన్ని సొసైటీలకు ఉద్వాసన పలుకగా అవి మనగడ కోల్పోయి రోడ్డున పడ్డాయి. గత పాలకులకు అనుకూలంగా ఉన్న సొసైటీలకు అనుమతులిచ్చారు. వాటిలో అనుకూలంగా లేని వాటిని మధ్యలోనే వివిధ సమస్యలు సృష్టించి నిలుపుదల చేయించారు. ఈ సొసైటీలు అన్ని గోదావరి ఇసుకతీత పనులపై ఆధారపడి జీవనం సాగించేవే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయిన సొసైటీలతో పాటు పెండింగ్‌లో పెట్టిన సొసైటీలను ఎంపిక చేసి మళ్లీ ఇసుకతీత పనులు కల్పించి జీవనోపాధి కల్పిస్తారని కొండంత ఆశ తో ఎదురుచూశారు. అయితే దానికి భిన్నంగా జరగడంతో సొసైటీలకు నిరాశ ఎదురవుతుంది. వీటిలో బినామీ పేర్లతో ఉన్న వాటిని నిలుపుదల చేస్తే పెద్దగా సమస్య ఉండకపోవచ్చు కానీ ఇసుకతీతపై పూర్తిగా ఆధారపడి జీవనం సాగించే సొసైటీలకు మాత్రం గడ్డుకాలమే.

ఇసుక సరఫరాకు అడ్డంకులు

జిల్లావ్యాప్తంగా ఇసుక తీత పనులు ముమ్మ రం చేయడంలో సొసైటీల పాత్ర చాలా కీలకం ఇంకా సొసైటీల ఎంపిక విధానం పూర్తికాలేదు. అందువల్ల ఇసుక ఉత్పత్తి లేక రేవులన్నీ వెలవెలబోతున్నాయి. జిల్లాలో అన్ని రీచ్‌లు ఓపెన్ కావాలంటే సొసైటీలకు వేగంగా అనుమతులు ఇవ్వా ల్సి ఉంది. ఈ ప్రక్రియ చాలా ఆలస్యం కావడంతో ఇసుక కొరత ఏర్పడి భవన నిర్మాణ రంగం కుదేలైంది. ఇప్పటికైనా కేటాయింపులు పూర్తి చేసుకుని అత్యవసరంగా ఇసుక ఉత్పత్తి చేయాల్సి ఉంది.

186 సొసైటీల ఎదురుచూపులు..

జిల్లాలో ఇసుక సొసైటీల కేటాయింపులు, ర్యాంప్‌ల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేసేందుకు కలెక్టర్, జేసీ,ఇరిగేషన్ అధికారులు కలిసి 14 మందితో ఏర్పాటు చేసిన కమిటీ ఇసుక తీత సొసైటీల ఎంపిక ప్రక్రియను పూర్తి స్థాయిలో పరిశీలిస్తుంది. జేసీ స్వయంగా వాటిని పరిశీలించి ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో ఇసుక తీత పనులకు సంబంధించి 44 సొసైటీలకు అధికార యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో 230 శాండ్ బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. వాటిలో 178 సొసైటీల పరిశీలన జరిగింది. వీటిలో 44 సొసైటీలకు అనుమతులిచ్చారు. ఇక మిగిలిన 186 సొసైటీల్లో ఎన్నింటిని ఎంపిక చేస్తారో వేచి చూడాల్సి ఉంది.ప్రతి సొసైటీకి ల్యాండ్ ఎలాట్‌మెంట్ ఇవ్వాలి.ల్యాండ్ లీజు అగ్రిమెంట్లు వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు సొసైటీలను మార్చే యడం వల్ల ఆ ప్రభావం ఇసుకపై పడుతుంది.

- జిల్లాలో 230కి 44 ఎంపిక
- 186 సొసైటీల భవిష్యత్ ప్రశ్నార్థకం
- 14 మంది సభ్యుల పరిశీలన
- నేటికీ అనుమతుల్లేక ఇక్కట్లు
- జిల్లాలో తీవ్రంగా ఇసుక కొరత
- అయినా స్పందించని అధికారులు
- లబోదిబోమంటున్న నిర్వాహకులు



మా కోసమేనని : మహిళ రక్షక్ ఆరంభ కార్యక్రమానికి ప్లకార్డులతో హాజరైన విద్యార్థినులు

మహిళలు, చిన్నారులకు కష్టం వస్తే..
డయల్ 94932 06006

- 15 నిమిషాల్లో స్పాట్‌కు వస్తాం.. రక్షిస్తాం : ఎస్పీ
- 'మహిళా రక్షక్' ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంతి



మహిళ రక్షక్ లోగో ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

రాజమహేంద్రవరం,అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): 'మహిళా రక్షక్'తో మహిళలు, చిన్నారులకు మరింత భద్రత సాధ్యమవుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్‌లో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎస్పీ నరసింహ కిషోర్ వినూత్న ఆలోచనతో రూపకల్పన చేసిన 'మహిళా రక్షక్' పోలీసుల ప్రత్యేక బ్లేజర్, లోగోలను ఆవి ష్కరించారు.మహిళా రక్షక్ ప్రత్యేక వాహనాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అందుబాటులో ఉన్న సిబ్బంది, నిధులతో మహిళలు, చిన్నారుల రక్షణకు ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా రక్షక్ ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలకు భరోసా కల్పిస్తుందన్నారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు,చిన్నారులు 94932 06006 నెంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ మెసేజ్ చేస్తే 15 నిమి షాల్లోపు పోలీసులు వారి వద్దకు చేరుకొని రక్షణ కల్పిస్తారన్నారు.డయల్ 112కి సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు. అవసరమైతే వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ నెంబర్లు 24/7 అందుబాటులో ఉంటాయని చెప్పారు.ఈ టీంలు కళాశాలలు, స్కూల్స్, వసతి గృహాలు తదితర చోట్ల నిరంతరంగా సంచరి స్తాయన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా వెళ్లి వారికి తెలియజేసిన వెంటనే చర్యలకు దిగుతారన్నారు. ఒక వేళ నేరుగా చెప్పే పరిస్థితి లేకపోతే వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అందుకు తగిన ఏర్పాట్లు చేశా మన్నారు.ఈ వాట్సాప్ నెంబరు, లోగోను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం ద్వారా మరింత మందికి అవగాహన కల్పించాలన్నారు.'మహి ళల భద్రత -మనందరి బాధ్యత' అని ప్రమాణం చేయించారు.అనంతరం మానవహారం,ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఐసీడీ ఎస్ జిల్లా అధికారిణి కె.విజయకుమారి, అడిష నల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు ఎస్.భవ్య కిషోర్, కె.రమేశ్ బా బు, జి.దేవకుమార్, సీఐలు, ఎస్‌ఐలు,ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు తదితరు లు పాల్గొన్నారు.



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న మహిళ రక్షక్ టీమ్..

వైసీపీ సర్పంచ్ సహా 30 మంది టీడీపీలో చేరిక

నల్లజర్ల, అక్టోబరు 2: ద్వారకా తిరుమల మండలం బుట్టయిగూడెం గ్రామ సర్పంచ్ ఘంటా నాగ సుబ్రహ్మణ్యంతోపాటు మరో 30 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పేర్కొన్నారు. బుధవారం నల్లజర్ల పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల పార్టీ అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మహాత్ముల ఆశయాలు అనుసరణీయం

కలెక్టరేట్‌లో గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రిల జయంతి

రాజమహేంద్రవరం రూరల్ 2: మహాత్ముల ఆశయాలు అనుసరణీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకొని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడుతో కలిసి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛభారత్ కోసం గాంధీజీ కలలు కన్నారన్నారు. మహాత్ముల ఆశయాలను ఆచరణలో చూపడం ద్వారా వారికి నిజమైన నివాళి అందిద్దామని పిలుపునిచ్చారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం కూడా వారి ఆశయాలు నెరవేర్చిన వారమవుతామన్నారు. మహాత్ముల జీవితాన్ని భావితరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందని జాయింట్ కలెకర్ చిన్నరాముడు అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో: కాతేరులోగల వ్యవసాయ కళాశాలలో గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఉమామహేశ్వరి, సీహెచ్ సునీత, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బాట యువతకు శిరోధార్యం

కొవ్వూరు, అక్టోబరు 2: మహాత్మా గాంధీ బాట యువతకు దిక్సూచి అని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతిని ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గాంధీ జయంతిని ఆర్డీవో రాణి సుస్మిత ఆధ్వర్యంలో నిర్వహించారు. మెయిన్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరిగెల అరుణకుమారి గాంధీ విగ్రహానికి నివాళులర్పిం చారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్, ఆర్యవైశ్య కల్యాణ మండపాల్లో గాంధీ జయంతిని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటా నికి నివాళులర్పించారు. కొవ్వూరు మహాత్మాగాంధీ బట్టల వర్తక సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.



కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



నిడదవోలు టీడీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, వెలగన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద డీటీ భారతి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్ర మంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, వీఆర్‌వో లు కావేరి నాగేశ్వరరావు, సంజీవరావు, రెవెన్యూ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపూడి గాంధీబొమ్మ సెంటరులో గాంధీ విగ్రహానికి మానవతా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమం లో సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్, గోకవరపు బాబులు, హనుమంతరావు, సంస్థ సభ్యులు పాల్గొ న్నారు. వేగేశ్వరపురం పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతిని జరిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ పరశురామారావు తదితరులు పాల్గొన్నారు. పెద్దేవం గ్రామంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు.

పెరవలి: ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామ సచివాలయాల వద్ద గాంధీ జయంతిని జరిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమం లో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కానూరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో క్లబ్ అధ్యక్షుడు కోలా సీతయ్యనాయుడు, సెక్రటరీ బూరుగుపల్లి రాజు, కొమ్మిశెట్టి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు. పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ డేవిడ్ నిశ్చల్ తదితర సిబ్బంది గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కానూరు హైస్కూలులో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, ఉపసర్పంచ్ అనపర్తి నరసింహమూర్తి పాల్గొన్నారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమం లో బొడ్డు రామాంజనేయులు, సలాది శ్రీహరి, ఎంపీటీసీ రాపాక ప్రమీల, సర్పంచ్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు. అజ్జరం పాఠశాలలో గాంధీ జయంతితో పాటు లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఆర్‌వీ ఎస్‌ఎన్ రెడ్డి, ఎంఈవో షేక్ నూర్జహాన్, ఉపాధ్యాయుడు కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి నివాళుల ర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ళ శ్రీరామ్, కరుటూరి సతీష్ తదితరులతో పాటు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సెంటర్‌లో గాంధీ జయంతి నిర్వహించారు. సభ్యులు ఆళ్ళ వెంకట సత్యనారాయణ, గ్రంది రాంబాబు, కోడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొ న్నారు. వాసవి ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో నాలుగు బొమ్మల సెంటర్‌లో గాంధీ విగ్రహానికి వాసవి మహిళలు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: గాంధీ జయంతి సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, ఎంపీడీవో జీవీఎస్‌కె రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జేడీవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం, గ్రంథాలయంతో పాటు, మండలం లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉపాధిహామీ పథకం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో: గాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. దుద్దుకూరు గ్రామంలో ఆ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎండీ రఫీఉల్లాబేగ్, డాక్టర్ వడయార్, వెలగా రామకృష్ణ, కాకర్ల హరిబాబు, ఎం.శారద, పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గాంధీ జయంతిని పురస్కరించుకుని దొండపూడి చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్యాల రాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులను సత్కరించారు. గోపాలపురం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులను సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొవ్వూరు, అక్టోబరు 2: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపల్ మెయిన్ వర్క్సులో బుధవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హాజరై స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా 10 వేల మొక్కల సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు మద్దుల సత్యనారాయణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, వటికూటి వెంకటేశ్వరరావు తదితరులతో పాటు, వాసవీ క్లబ్ సభ్యులు వలివేటి ప్రసాద్, దేవతు కృష్ణప్రసాద్, మద్దుల నాని తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు నూలు వారి సత్రంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం కుమారదేవం గ్రామంలో ఎంపీడీవో కె.సుశీల ఆధ్వర్యంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. కార్యక్రమంలో వట్టికూటి వెంకటేశ్వరరావు, గొరిజాల సురేష్, ఈవోఆర్‌డి శర్మ తదితరులు పాల్గొన్నారు.



ముళ్ళపూడి బాపిరాజును పరామర్శిస్తున్న ఎంపీ పురందేశ్వరి

ఎంపీ పురందేశ్వరి పరామర్శ

నల్లజర్ల, అక్టోబరు 2: ఇటీవల జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి మృతి చెందడంతో రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, కోర్రా కన్నయ్య, యలమాటి శ్రీనివాస్, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా నిల్వ ఉంచితే చర్యలు

కొవ్వూరు, అక్టోబరు 2: అక్రమంగా బాణసంచా తయారు చేసినా లేదా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ హెచ్చరించారు. కొవ్వూరు డీఎస్పీ కార్యాలయంలో బాణసంచా తయారీదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సులో మంజూరు చేసిన సామర్థ్యం మేరకు మాత్రమే బాణసంచా తయారు చేయాలన్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 14 మంది బాణసంచా తయారీదారులు ఉన్నారన్నారు. వారిలో పిట్టల వేమవరానికి చెందిన లైసెన్స్ ఇంకా రెన్యూవల్ చేయాల్సి ఉందన్నారు. లైసెన్సు రెన్యూవల్ చేయించుకోకుండా పరిమితికి మించి, అనుమతిలేని బాణసంచా నిల్వ ఉంచడంపై సెప్టెంబరు 30న లైసెన్సుదారుడిపై కేసు నమోదు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నెలటూరుకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో అవార్డు

చాగల్లు, అక్టోబరు 2: మండలంలోని నెలటూరు పంచాయతి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో సీటీయూ విభాగంలో అవార్డు దక్కించుకుంది. బుధవారం జిల్లా కలెక్టర్ వి.ప్రశాంతి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నుంచి పంచాయతి కార్యదర్శి ఎం.ఈశ్వరప్రసాద్ నెప్రశా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ యడ్లపల్లి ఉమా రజని మాట్లాడుతూ అవార్డు దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు యడ్లపల్లి రకారావు, నందిగం శ్రీను, తాళ్ళూరి ప్రసాద్, తాళ్ళూరి శ్రీనివాసరావు, కోడూరి రామకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మల్లవరంలోని గాంధీ స్మారక నిధి, ఆనంద నికేతన్ ఆశ్రమంలో పలువురుని సన్మానించిన దృశ్యం

ఆశ్రమంలో పలువురికి సన్మానం

చాగల్లు, అక్టోబర్ 2: మహాత్మాగాంధీ ఆశయాలు అనుసరణీయమని గాంధీ స్మారకనిధి ఏపీ చైర్మన్, ఐపీఎస్ డాక్టర్ గాంధీ పీసీ కాజా అన్నారు. మండలంలోని మల్లవరం గాంధీ స్మారక నిధి, ఆనంద నికేతన్ ఆశ్రమంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు, శాంతి సేన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్.సత్యనారాయణ, డాక్టర్ లలితాంబ, రాధాకృష్ణ, చర్ల మృదుల కుమారి తదితరులకు గాంధీ స్మారక పురస్కారాలు అందజేసి సన్మానించారు. చిత్రలేఖనం పోటీల్లో విజయం సాధించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, మానవత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గాంధీకి నివాళులు